క్లుప్తంగా

ఇందిరా డెయిరీతో ఆర్థికాభివృద్ధి

మధిర: ఇందిరా మహిళా డెయిరీతో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించాలని అడిషనల్ డీఆర్డీఓ నూరుద్దీన్ సూచించారు. మండలంలోని దెందుకూరులో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. డెయిలో సభ్యత్వం తీసుకున్న మహిళలకు సబ్సిడీపై పాడి గేదెలు ఇప్పిస్తామని, తద్వారా పాలు అమ్ముతూ కుటుంబాలు అభివృద్ధి సాధించాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతీ సభ్యురాలికి 80శాతం సబ్సిడీతో రెండేసి పాడి గేదెలు ఇప్పించనున్నట్లు చెప్పారు. డెయిరీ ఏపీఎం జంగం లక్ష్మణరావు, ఏబీఎస్ మామిళ్ల శ్రీనివాసరావు, డెయిరీ అధ్యక్షురాలు కంటిపూడి అన్నపూర్ణ, సీసీలు కోటేశ్వర రెడ్డి, భారతి, రమాదేవి పాల్గొన్నారు.

25న మైనార్టీ పాఠశాలలో లక్కీడ్రా

సత్తుపల్లి: ఈ విద్యాసంవత్సరానికి ఐదో తరగతిలో నాన్‌మైనార్టీ విభాగంలో ప్రవేశాల భర్తీకి ఈ నెల 25వ తేదీన ఉదయం 11 గంటలకు సత్తుపల్లిలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో లక్కీడ్రా నిర్వహించబడుతుందని ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసే ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు, విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

'నవోదయ'లో సీటు సాధించిన విద్యార్థి



రేవతిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మధిర: మండలంలోని మాటూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థిని ఎక్కిటీల రేవతి ఇటీవల విడుదలైన ఫలితాల్లో జవహర్ నవోదయలో సీటు సాధించింది. ఈ సందర్భంగా ఆమెను బుధవారం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం చెరుపల్లి శ్రీహరి ఆధ్వర్యాన అభినందించారు. ఈకార్యక్రమంలో బొగ్గుల శ్రీనివాసరెడ్డి, కొట్టే వెంకట్రావమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు మాక్ ఎప్‌సెట్

కొణిజర్ల: తెలంగాణ మైనార్టీ బాలుర, బాలికల గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులకు మండలంలోని తనికెళ్ల సమీపాన విజయ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మాక్ ఎప్‌సెట్ నిర్వహించారు. పరీక్షకు ఎలా సిద్ధం కావాలి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడంపై అవగాహన ఏర్పడిందని విద్యార్థులు తెలిపారు. ప్రిన్సిపాళ్లు లింగాల జితేష్‌సాహిల్, సీహెచ్.అఖిల, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏటి బ్రిడ్జిపై ఏళ్లుగా కష్టాలు

- రక్షణ గోడలు లేక నిత్యకృత్యంగా ప్రమాదాలు
- భయంభయంగా వాహనదారుల రాకపోకలు
- రెండు జిల్లాలకు దగ్గరి దారి అని తెలిసినా పట్టించుకోని యంత్రాంగం



తీగలబంజర వద్ద పగిడేరుపై రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి

కొణిజర్ల: ఖమ్మం జిల్లా కేంద్రం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి అత్యంత దగ్గర దారి పల్లిపాడు, ఏన్కూరు రహదారి. ఈ దారిలో లాలాపురం, తీగలబంజర గ్రామాల మధ్య ఉన్న పగిడేరు వాగు పై నిర్మించిన లోలెవల్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా తయారైంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు భయంభయంగా ఈ బ్రిడ్జిపై ప్రయాణం చేస్తున్నారు.

20 ఏళ్ల క్రితం నిర్మాణం..

కొణిజర్ల మండలం లాలాపురం, తీగలబంజర గ్రామాల మధ్య పగిడేరుపై 20 ఏళ్ల క్రితం లోలెవల్ బ్రిడ్జి నిర్మించారు. ప్రతీ ఏటా వానాకాలం వాగుకు వరదలు వచ్చి బ్రిడ్జి పైన సుమారు 4 నుంచి 5 అడుగుల మేర నీరు ప్రవహిస్తుంది. వరద తాకిడికి బ్రిడ్జికి రెండు వైపులా నిర్మించిన రక్షణ గోడలు విరిగిపోయాయి. దీనికి తోడు రోడ్డు కూడా వరదలకు అట్టలు, అట్టలుగా లేచిపోతుంది. అధికారులు తూతూ మంత్రంగా రోడ్డకు మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. దీంతో ఓ వైపు రక్షణ గోడలు లేక, మరో వైపు రోడ్డు గుంతలమయంగా ఉండటం వల్ల వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో అయితే కొత్త వ్యక్తులు గుంతలు తెలియక పడి గాయాలపాలైన ఘటనలు కో కొల్లలు.

ప్రమాదకరంగా బ్రిడ్జి..

ఖమ్మం, కొత్తగూడెంలకు దగ్గరి దారి కావడంతో వాహనదారులు పల్లిపాడు ఏన్కూరు మీదుగా కొత్తగూడెం, భద్రాచలం వెళ్తుంటారు. ముఖ్యంగా భద్రాచలం, పాల్వంచ తదితర ప్రాంతాల నుంచి వచ్చే ఇసుక లారీలు ఈ రోడ్డు మీదనే వస్తుంటాయి. ఇసుక లోడు ధాటికి బ్రిడ్జి ఎప్పుడు కూలిపోతుందో అని స్థానికులు భయపడుతున్నారు. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ఈ రహదారిపై వెళ్తుంటాయి. బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడు కూలుతుందో తెలియక ప్రమాదకర పరిస్థితుల్లో తప్పని సరై ప్రయాణం చేయాల్సి వస్తుందంటున్నారు. ఈ రహదారిపై సుమారు 14 గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రం కొణిజర్ల, జిల్లా కేంద్రం ఖమ్మంకు ప్రయాణిస్తున్నారు. ఏదైనా జరగరానిది జరిగి బ్రిడ్జి కూలిపోతే ఆయా గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయినట్లే.

ప్రతిపాదనలతోనే సరి..

గతంలో వైరా నియోజకవర్గ ఎమ్మెల్యేలుగా పనిచేసిన మదన్‌లాల్, రాములునాయక్‌ల హయాంలో పగిడేరుపై కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు చేయగా అధికారులు సర్వే కూడా చేశారు. కానీ ఆ పనులు కాగితాలకే పరిమితమయ్యాయి. దీంతో ఏటా వరదలు వచ్చినప్పుడు గ్రామాల నుంచి బయటకు రాలేక, ప్రమాదకర పరిస్థితులలో తప్పనిసరై ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పగిడేరుపై కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టి వాహనదారుల ఆయా గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

భయంభయంగా ప్రయాణం..



నిత్యం వైరా, కొణిజర్ల, ఖమ్మం వెళ్లి వస్తుంటాం. బ్రిడ్జిపై రక్షణ గోడలు లేకపోవడంతో రాత్రి వేళ ఏ ప్రమాదం జరుగుతోందనని ఆందోళనగా ఉంటుంది. ఆటోల్లో ప్రయాణించేటప్పుడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే.

– తేజావత్ సీతారాములు, లక్ష్మీపురం

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి..



లాలాపురం – తీగలబంజర మధ్య పగిడేరుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలి. వందలాది వాహనాల రాకపోకలతో బ్రిడ్జి కూలుతుందా అన్న భయయేస్తోంది. వానాకాలం రాకపోకలు నిలిచిపోతాయి. అధికారులు స్పందించాలి.

– అనుమోలు రామారావు, సీఐటీయూ జిల్లా నాయకుడు, లాలాపురం

రజతోత్సవ సభకు కదలిరావాలి



మధిర : మాట్లాడుతున్న కమల్‌రాజ్



వైరా : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

మధిర/వైరా: ఈనెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మధిర నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు కదలిరావాలని జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ కోరారు. సభ సన్నాహక సదస్సుల్లో భాగంగా బుధవారం మధిర మండలంలోని రాయపట్నంలో ఆయన పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి జరగకపోగా హామీల అమలులో విఫలమైనట్లు ప్రజలు గుర్తించారని తెలిపారు. ఈమేరకు పార్టీ శ్రేణులతో పాటు ప్రజలను సభకు తరలించాలని సూచించారు. ఈ సమావేశంలో మార్కెట్ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, నాయకులు చావా వేణు, తిమోతి, గోపి తదితరులు పాల్గొన్నారు. అలాగే, వైరాలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ మాట్లాడుతూ 27వ తేదీన ప్రతీ గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించి రజతోత్సవ సభకు బయలుదేరాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, నాయకులు కట్టా కృష్ణార్జునరావు, మాదినేని ప్రసాద్, పారుపల్లి నాగం, కామినేని శ్రీనివాసరావు, అయినాల కనకరత్నం, దేవరాజ్, సైదా, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

సత్తుపల్లి: ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ ఫైనలీయర్ పరీక్షలు యూనివర్సిటీ వాయిదా వేయటం బాధాకరమని వెంటనే పరీక్షలు జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు రియాంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించకపోవటం వల్ల పరీక్షల వాయిదాకు దారితీసిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డిగ్రీ పరీక్షలు వాయిదా వేయటం వల్ల ఐసెట్, లాసెట్ పరీక్షలు రాసే అవకాశం లేకుండా విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆంగ్ల భాష, పుస్తక దినోత్సవం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ ఆంగ్ల భాషా దినోత్సవం, పుస్తక దినోత్సవాలు నిర్వహించారు. ఐక్యూఏసీ, ఇంగ్లిష్ విభాగాధిపతులు కేపీ.ఐశ్వర్య, ఏ.శిరీష ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుస్తక పఠనం, భాష నైపుణ్యాల పెంచుకోవడంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రజిత, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్యతో పాటు కె.రజని, బి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో 'ఏక్‌భారత్.. శ్రేష్ట భారత్'

కల్లూరురూరల్: మండలంలోని చంద్రుపట్లలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏక్‌భారత్.. శ్రేష్ట భారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కంఠమహేశ్వర స్వామి ప్రతిష్ఠాపన



ఆలయంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్, తదితరులు

కొణిజర్ల: మండలంలోని కొండవనమాలలో శ్రీ బాలాజీ గ్రూప్ ఆఫ్ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి రూ.50లక్షల వ్యయంతో నిర్మించిన శ్రీ కంఠమహేశ్వరస్వామి, సూరమాంబదేవీ దేవాలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి, గౌడ సంఘం నాయకులు పూజలు చేయగా, కొండవనమాలతో పాటు సమీప గ్రామాల గౌడ కులస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

పాపన్నగౌడ్ స్ఫూర్తితో ప్రజాసేవ

వెనకబడిన కులాల అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ప్రజా సేవకు అంకితం కావాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సూచించారు. కొండవనమాలలో పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈకార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మాజీ ఎంపీపీ గోసు మధు, నాయకులు సూరంపల్లి రామారావు, కట్ల రంగారావు, కోసూరి శ్రీనివాసరావు, పరికపల్లి శ్రీను, సొసైటీ చైర్మన్ చెరుకుమల్లి రవి, గౌడ సంఘం నాయకులు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బైక్ ర్యాలీని జయప్రదం చేయండి



ఏన్కూరు : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

ఏన్కూరు/కొణిజర్ల/తల్లాడ: ఖమ్మంలో ఈనెల 25న నిర్వహించే సకల ఉద్యోగుల బైక్ ర్యాలీ, సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని మూల పోచారం ఆశ్రమ పాఠశాలలో బుధవారం వారు పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ర్యాలీ, సదస్సులో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. జేఏసీ నాయకులు డీ.ఎస్.నాగేశ్వరరావు, రాంచంద్, పుల్లయ్య, నాగరాజు, రవి, సింగ్యా, శోభన్, శ్యామల, వెంకటరమణ, రమేష్ చందర్‌రావు, సౌందర్య, హరియా నాయక్, తదితరులు పాల్గొన్నారు. కాగా, కొణిజర్లలో నిర్వహించిన సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్.వీరస్వామి, ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ ర్యాలీ, సదస్సుకు తరలిరావాలని కోరారు. అలాగే, తల్లాడలోని పలు కార్యాలయాల్లో ఉద్యోగులను టీఎన్జీవోస్ బాధ్యుడు పెద్ద పుల్లయ్య, సీఐటీయూ నాయకుడు వేణుగోపాల్ కలిసి ర్యాలీకి హాజరు కావాలని అవగాహన కల్పించారు. ఎంపీడీఓ సురేష్, ఏసీడీపీఓ నవ్యశ్రీ, సీహెచ్ఓ భాస్కర్, వాణిశ్రీ, ఈఓ కృష్ణారావు, మధుకర్‌రెడ్డి, చెంపలరాజు తదితరులను కూడా కలిశారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను..

ఎర్రుపాలెం: ఈ నెల 25, 26, 27 తేదీల్లో ఖమ్మం నగరంలో నిర్వహించనున్న భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకరరావు కోరారు. ఈ మేరకు బుధవారం మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, గౌష్, ఇమ్రాన్, జాని నాగుల్, సభాష్, కుమార్, పవణ్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను..

తల్లాడ: వచ్చే నెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. బుధవారం తల్లాడ సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఎం.రమేష్, డివిజన్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, రామలింగేశ్వరరావు, కృష్ణయ్య, నరేష్, నన్నేసాహెబ్, రామిరెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై దశలవారీ పోరాటం

సత్తుపల్లిరూరల్: సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో దశలవారీ పోరాటం చేస్తామని ఆ సంఘం రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ అన్నారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) బుధవారం కొత్తగూడెం ఏరియాలోని సత్తుపల్లి జేవీఆర్ ఓసీ మేనేజర్ బెజ్జంకి రాజేశ్వరరావుకు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. కార్మికులకు మెడికల్ విధానాన్ని అమలు చేయాలని, రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ యూనియన్ సెంట్రల్ సభ్యులు రవికుమార్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ వీరభద్రం, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రాజయ్య, ఫిట్ సెక్రటరీలు జీఎస్ శ్రీనివాస్, పిచ్చయ్య, ఆంజనేయులు, బ్రాంచ్ సెక్రటరీలు ఈశ్వర్, అశోక్, తిరుపతయ్య, రామకృష్ణ, అనీల్, ఉపేందర్, రమేష్, కార్మికులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అరికట్టాలి



సత్తుపల్లి: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సత్తుపల్లి: దేశంలో ఉగ్రవాదాన్ని అరికట్టాలని కోరుతూ సత్తుపల్లిలో బుధవారం రాత్రి హిందూ సంఘాల ఆధ్వర్యాన కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉగ్ర దాడిలో మృతి చెందినవారికి నివాళిలర్పించారు. కార్యక్రమంలో ఈవి రమేష్, పెద్దింటి సూర్యనారాయణ, మాధురి మధు, దోసపాటి ప్రసాద్, అభి శ్రీనివాస్, చందు, గిరి, శ్రీనివాస్, నరేష్, గుంజా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడ బస్టాండ్ సెంటర్లో సీపీఎం ఆధ్వర్యంలో ఉగ్రవాది దిష్టి బొమ్మను దగ్ధం చేసి నిరశన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రమేష్, మాచర్ల భారతి, డివిజన్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి రామలింగేశ్వరరావు, బీజేపీ జిల్లా నాయకులు వెంకటరామారావు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: మండలంలోని సిద్ధారంలో సీపీఎం నాయకులు దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, జ్యోతి, సనందస్‌రావు, కృష్ణయ్య, రాములు, లక్ష్మణరావు, నారాయణమ్మ పాల్గొన్నారు.

పెహల్గాం మృతులకు శ్రద్ధాంజలి


ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు శ్రీభాస్కర మెమోరియల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జమ్మూ – కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పెహల్గాంలో ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన పర్యాటకులకు బుధవారం శ్రద్ధాంజలి ఘటించారు. కొద్దిసేపు మౌనం పాటించి నివాళి అర్పించారు. ఉగ్రవాదులు పైశాచికంగా కాల్పులు జరిపి 27మంది పర్యాటకులను పొట్టనపెట్టుకున్నారని, ఇది చాలా బాధాకరమని, జాతి మొత్తం ఖండించాలని పాఠశాల కరస్పాండెంట్ సూర్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

● **ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహకాలు**

కల్లూరురూరల్: మండలంలోని కొర్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామస్తుల సహకారంతో ప్రోత్సాహకాలు అందించారు. బుధవారం పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఒకటినుంచి 7తరగతులకు అన్ని సబ్జెక్టులలో ప్రతిభ చూపిన ఒక్కొక్క విద్యార్థికి రిటైర్డ్ సీఐ బైరెడ్డి రాఘవరెడ్డి రూ.7వేలు అందించారు. అదే విధంగా మరో రూ.7వేలు అందించగా.. చేనేత ఫౌండేషన్ రూ.7వేలు మొత్తం రూ.14వేలు వ్యయంతో టీవీని పాఠశాలకు అందించారు. అనంతరం వచ్చే విద్యాసంవత్సరం పాఠశాల విద్యార్థులకు రెండు జతల యూనిఫాం అందించేందుకు కిరణ్‌రెడ్డి ముందుకు రావడంతో పాటు.. మధ్యాహ్న భోజనానికి మరో రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ పానుగంటి రమాదేవి, పాఠశాల హెచ్ఎం అమర్లపూడి చక్రవర్తి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్, గ్రామ ప్రముఖులు బైరెడ్డి రాఘవరెడ్డి, మట్టా రామకృష్ణ, ఉపాధ్యాయులు, ఎస్.కృష్ణబాబు, పి.శ్రీనివాసరెడ్డి, కె.విజయకుమార్ పాల్గొన్నారు.

● **వాహన పత్రాలు తప్పనిసరి**



ఆర్థిక సాయం అందిస్తున్న ఎంవీఐ శ్రీనివాసరావు

సత్తుపల్లిటౌన్: వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా వాహన పత్రాలు ఉండాలని సత్తుపల్లి రవాణాశాఖాధికారి జేఎస్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మెట్టాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ట్రాలీఆటో ఓనర్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన బుధవారం గుర్తింపు కార్డులు అందించారు. అదే విధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ట్రాలీ ఆటో డ్రైవర్ సూర్యకాంత కిరణ్ కుటుంబానికి రూ.6వేలు ఆర్థిక సాయాన్ని ఎంవీఐ శ్రీనివాసరావు చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బానోత్ నందు నాయక్, ఉపాధ్యక్షుడు ఖలీల్, కోశాధికారి శ్రీనివాస్, మల్లేష్, లాల్ అహ్మద్, లక్ష్మణ్, శివ, పుల్లారావు, ఉమా, నాగేశ్వరరావు, చెన్నారెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

● **ప్రభుత్వ పాఠశాలకు ల్యాప్‌టాప్ వితరణ**

కల్లూరురూరల్: మండలంలోని పెద్దకోరుకొండి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలకు మధిర మాజీ శాసన సభ్యుడు దివంగత కట్టా వెంకట నర్సయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.70వేలు విలువైన ల్యాప్‌టాప్‌ను బుధవారం వితరణగా అందించారు. వెంకటనర్సయ్య కుమారుడు.. కల్లూరు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అజయ్‌కుమార్ పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తికి అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేము రత్తమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యులు చిట్టిబాబు, స్థానిక ప్రముఖులు శ్రీనివాసరెడ్డి, మచ్చా హనుమంతరావు, జాస్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● **సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ**

చింతకాని: మండలంలోని మత్కేపల్లి, బస్వాపురం గ్రామాల్లో పలువురికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు బుధవారం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న పగడాల పావయ్య, వంశీ, కన్నెబోయిన సాంబశివరావు, రాసాల సాంబలక్ష్మికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫారసుతో రూ.1.21 లక్షల విలువైన చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కన్నెబోయిన గోపి, కంచం కోటేశ్వరరావు, బొల్లకొండ రామారావు, తిరుపతి అంజయ్య, నర్సింశెట్టి శ్రీనివాసరావు, వలమల రామారావు, గోద ప్రసాద్, వెంకన్న, బండి ఉపేందర్, షేక్ షాజహాన్, కుక్కల వెంకటేశ్వర్లు, కన్నెబోయిన పాండురంగారావు, మార్గం నాగరాజు, కుక్కల కోటేశ్వరరావు, సోమా నర్సింహారావు, షేక్ షంషుద్దీన్ పాల్గొన్నారు.

● **మిస్ట్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్**

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాలలో బుధవారం మెడ్‌ప్లస్ ఆధ్వర్యాన సీనియర్ ఎగ్జిక్యూటివ్ మహ్మద్‌తాజుద్దీన్ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 36మంది విద్యార్థులకు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా శ్రీనివాసరెడ్డి, కోఆర్డినేటర్ జయవరపు కుమార్‌రాజా, దాసరి ప్రవీణ్‌కుమార్, గంటా మానస, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావులు అభినందించారు.

● **పాఠశాలలో కళావేదిక ప్రారంభం**

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో దాత తల్లపురెడ్డి మధుసూదన్‌రెడ్డి వితరణతో నిర్మించిన కళా వేదిక నిర్మాణాన్ని ఎంఈఓ మురళీమోహన్‌రావు ప్రారంభించి మాట్లాడారు. దాత మధుసూదన్‌రెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేమిరెడ్డి అనురాధ, నాయకులు సందీప్‌రెడ్డి, అంజిరెడ్డి, సతీష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఇస్మాయిల్, పంచాయతీ కార్యదర్శి శివ, ప్రైమరీ పాఠశాల హెచ్ఎం అరుణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **ప్రధాన సమస్యలు గుర్తించాలి**

వైరా: వైరాలోని 20 వార్డుల్లో ఉన్న ప్రధాన సమస్యలన గుర్తించాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. అధికారులు ఎప్పటి కప్పుడు ప్రగతి నివేదిక తనకు అందించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● **ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సినేషన్**

సత్తుపల్లిటౌన్: ఏడు రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకు గాను మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా బుధవారం ప్రత్యేక టీకాల కార్యక్రమం నిర్వహించారు. గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యాన సత్తుపల్లి మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 0–5 ఏళ్ల చిన్నారులకు వ్యాక్సిన్లు వేశారు. డాక్టర్ అవినాష్, ఉద్యోగులు వెంకటేశ్వర్లు, శారారాణి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

● **భూభారతిపై అవగాహన**



జమలాపురంలో మాట్లాడుతున్న డీఆర్ఓ పద్మశ్రీ

ఎర్రుపాలెం: భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతిపై రైతులకు అవగాహన అవసరమని డీఆర్ఓ పద్మశ్రీ, డీపీఓ ఆశాలత తెలిపారు. బుధవారం మండలంలోని జమలాపురంలో భూభారతి పోర్టల్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఈ పోర్టల్ ద్వారా చేకూరే ప్రయోజనాలను వివరించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ విజయచంద్ర, తహసీల్దార్ ఉషాశారద, మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

● **రేపు వైరాలో..**

వైరా: ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈనెల 25న శుక్రవారం సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కేవీ.శ్రీనివాస్ తెలిపారు. వైరాలోని కామిశెట్టి కల్యాణ మండపంలో జరిగే ఈ సదస్సుకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పాల్గొననుండగా, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మా పాప.. మా ఇంటి మణిదీపం



చింతకాని : మత్కేపల్లిలో బాలిక తల్లికి సన్మానపత్రం అందజేస్తున్న డీపీఓ ఆశాలత



వైరారూరల్ : ఆడపిల్లకు జన్మనిచ్చిన దంపతులను సన్మానిస్తున్న డీడీ సత్యనారాయణ



పెనుబల్లి : తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఆడశిశువుకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను సన్మానించేందుకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ రూపొందించిన 'మా పాప – మా మణిదీపం' కార్యక్రమాన్ని మధిర, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపిల్లకు జన్మనిచ్చిన వారి ఇంటికి వెళ్లిన అధికారులు స్వీట్లు, పండ్లు అందించి సన్మానించడమే కాక మగపిల్లలతో సమానంగా పెంచాలని అవగాహన కల్పించారు.

చింతకాని మండలం మత్కేపల్లిలో బాలింత సబితను డీపీఓ ఆశాలత సన్మానించగా ఐసీడీఎస్ ఏసీడీపీఓ శివకుమారి, ఎంపీఓ పర్వీన్ ఖైసర్, ఏఎన్ఎం రేణుక, గ్రామపంచాయతీ కార్యదర్శి శివరామకృష్ణారెడ్డితో పాటు విజయలక్ష్మి, నాగమణి, ఉష, ప్రమీల పాల్గొన్నారు. ఎర్రుపాలెం మండలం మీనవోలు, తక్కెళ్లపాడుల్లో యరమల శివశంకర్‌రెడ్డి–నాగదివ్య దంపతులను ఐసీడీఎస్ ఏసీడీపీఓ జి.కృష్ణశ్రీ, ఎంపీడీఓ బి.సురేందర్ సన్మానించారు. ఎంఎల్‌హెచ్‌పీ షమీరాతో పాటు సరిత, సునీత, మధులత, రాజేశ్వరి, మణెమ్మ, హరికృష్ణ, సుగుణ పాల్గొన్నారు. ముదిగొండ మండలం సువర్ణాపురంలో తెల్లగొర్ల ఉమ – ప్రవీణ్‌ను సన్మానించగా మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఏసీడీపీఓ శాంతితో పాటు గోపమ్మ, కనపర్తి కుమారి, పద్మ, ప్రేమలత, షహనాజ్ పాల్గొన్నారు. ఇక బోనకల్ మండలం ముష్టికుంట్లలో ఆడశిశువుకు జన్మనిచ్చిన జాన్‌బీ–ఫయాజ్‌తో పాటు వారి తల్లిదండ్రులను సన్మానించారు. తహసీల్దార్ పున్నంచందర్, ఎంపీడీఓ రమాదేవితో పాటు సుజాత, రమాదేవి, స్వర్ణమార్త, శాస్త్రి, మైథిలి, ఫాతిమా, శివరాణి, నిర్మల, రాజ్యలక్ష్మి, శైలజ, అనిత, రమాదేవి, శివశంకర్ పాల్గొన్నారు. అలాగే, కొణిజర్ల మండలం మల్లుపల్లిలో దొడ్డపనేని సురేష్ – నిర్మల దంపతుల కూతురు నవ్య ఇటీవల ఆడపిల్లకు జన్మనివ్వగా వారిని సన్మానించారు. వివిధ శఖల ఉద్యోగులు వాసిరెడ్డి ఉషారాణి, జ్యోతి పాల్గొన్నారు. వైరా మండలం కేజీ సిరిపురంలో నజీమా – తాజుద్దీన్ దంపతులను ఎస్సీ కార్పొరేషన్ డీడీ కస్తాల సత్యనారాయణ సన్మానించి సర్టిఫికెట్ అందజేశారు. ఎంపీడీఓ పి.సరస్వతి, ఉద్యోగులు సరిత, బీజాన్‌బీ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు. ఇక పెనుబల్లి మండలం రామచందర్‌రావు బంజర్‌లో ఇమ్మడి వెంకటేశ్వరరావు కుమార్తె సాధిక – రంజిత్‌ను సన్మానించారు. ఎంపీడీఓ అన్నపూర్ణతో పాటు ఉద్యోగులు ఉపేంద్రయ్య, మెహర్‌రున్నీసా బేగం, అనురాధ, సోనాలి, నాయకులు పాల్గొన్నారు. సత్తుపల్లి మండలం గంగారం ఎస్టీ కాలనీలో ఆడపిల్లకు జన్మనిచ్చిన సోయం మహేష్ – స్వప్న దంపతులను అధికారులు సత్కరించారు. డీవైఎస్ఓ సునీల్‌రెడ్డితో పాటు ఉద్యోగులు కనకదుర్గ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.